సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

గురువారం । 7 । మార్చి । 2024



కనులపండువగా కల్యాణం

పాడేరులోని ఉమానీలకంఠేశ్వరస్వామి వారి కల్యాణం బుధవారం రాత్రి కన్నుల పండువగా నిర్వహించారు. 8లో



బాలికా విద్యకు ప్రాధాన్యం 8లో

రాష్ట్ర ప్రభుత్వం బాలికా విద్యకు అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని శిశు సంక్షేమశాఖ పీడీ సూర్యలక్ష్మి కోరారు.



విద్యార్థుల ఆరోగ్యంపై అశ్రద్ధ వహిస్తే చర్యలు 8లో

విద్యార్థుల ఆరోగ్యంపై ఆశ్రద్ధ వహిస్తే చర్యలు తప్పవని పీవోఅభిషేక్ హెచ్చరించారు.

న్యూస్‌రీల్

పార్కింగ్ టోల్ గేటు ప్రారంభం



టోల్‌గేటు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీపీ శెట్టి నీలవేణి తదితరులు

అనంతగిరి:మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రాగుహలకు వెళ్లేమార్గం మధ్యలోని మండల పరిషత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పార్కింగ్ టోల్‌గేటు శిలాఫలకాన్ని ఎంపీపీ శెట్టినీలవేణి బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్కింగ్ టోల్‌గేటు ద్వారా వచ్చే ఆదాయంలో 60శాతం బొర్రాలో పారిశుధ్యం నిర్వహణ కేటాయిస్తామన్నారు. మిగతా 40శాతం మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రాలను ఆనుకుని ఉన్న ప్రధాన రహదారికి ఇరువైపులా పారిశుధ్యం మెరుగునకు వెచ్చిస్తామన్నారు. అనంతరం ఎంపీడీవో శ్రీహర్షిత్ మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు టోల్‌గేటు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. సర్పంచ్ అప్పారావు, వైస్ ఎంపీపీ దూరు జయవర్ధిని, జెడ్పీటీసీ గంగరాజు, కో ఆప్షన్ సభ్యుడు మదీనా, దానియేలు, నవీన్, తహసీల్దార్ నాగజ్యోతి, రేంజర్ దుర్గాప్రసాద్, ఆర్ఐ శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ



సూచనలు ఇస్తున్న జేసీ భావన వశిష్ఠ

గూడెంకొత్తవీధి: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని జాయింట్‌కలెక్టర్ భావన వశిష్ఠ ఆదేశించారు. బుధవారం ఆమె మండలంలోని రింతాడ, ఏబులం, పెదవలస, నిమ్మలపాలెం, సంకాడ గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. మౌలిక సదుపాయాలపై అధికారులతో మాట్లాడారు. వసరమైన సలహాలు ఇచ్చారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ రత్నకుమార్, డీటీ కుమారస్వామి, ఆర్ఐ మహదేవ్ పాల్గొన్నారు.

సికిల్‌సెల్ ఎనీమియా నివారణకు చర్యలు



ప్రచార రథాలను ప్రారంభిస్తున్న కలెక్టర్ విజయసునీత, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

- కలెక్టర్ విజయ సునీత

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా సికిల్‌సెల్ ఎనీమియాపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ వైద్యబృందాలను ఆదేశించారు. పాడేరు ఐటీడీఏకు చేరుకున్న మరో నాలుగు ప్రచార రథాలను పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మితో కలిసి బుధవారం ఆమె ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సికిల్‌సెల్ ఎనీమియా నివారణకు పటిష్టమైన చర్యలు చేపడుతున్నాయన్నారు. ఈకార్యక్రమంలో ఐటీడీఏ పీవో వి.అభిషేక్, పాడేరు.హుకుంపేట ఎంపీపీలు ఎస్,రత్నకుమారి, కూడా రాజుబాబు పాల్గొన్నారు.

రూరల్ ఆర్గానిక్ మార్ట్ సందర్శన



రికార్డులను పరిశీలిస్తున్న నాబార్డ్ డీడీఎం సామంత్‌కుమార్

వీఆర్‌పురం: రేఖపల్లిలో ఏఎస్‌డీఎస్ సహకారంతో పాపికొండలు రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రూరల్ ఆర్గానిక్ మార్ట్‌ను నాబార్డ్ డీడీఎం జీఆర్ సామంత్ కుమార్ బుధవారం సందర్శించారు. మార్ట్‌లో ఉత్పత్తులు, విక్రయాలకు సంబంధించిన వివరాలను నిర్వాహకుల నుంచి తెలుసుకున్నారు. మొబైల్ వాహనం అందుబాటులో ఉంటే ఆర్గానిక్ ఉత్పత్తులను వారాంతపు సంతలు, పర్యాటక ప్రాంతాలకు తరలించి వ్యాపారం అభివృద్ధి చేసుకునే అవకాశం ఉందని వారు వివరించారు. చింతూరులో ప్రతి బుధవారం జరిగే వారపు సంతలో ఆర్గానిక్ కూరగాయలు, ఇతర ఉత్పత్తులను సంఘం ఆధ్వర్యంలో విక్రయిస్తున్నామన్నారు. ఇక్కడ షెడ్లు నిర్మించాలని వారు డీడీఎంను కోరారు. దీనిపై ఆయన స్పందిస్తూ నాబార్డు సహకారంతో ఇప్పటికే ప్రత్యేక షెడ్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టామన్నారు.

శివపూజకు వేళాయె

జిల్లాలోని శైవక్షేత్రాలు మహాశివరాత్రి వేడుకలకు సిద్ధమయ్యాయి. తెలుగు రాష్ట్రాలతో పాటు సరిహద్దులోని ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల భక్తులు కొలిచే మత్స్యగుండంలోని మత్స్యలింగేశ్వరస్వామి ఆలయం వద్ద మూడు రోజుల జాతరకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.పాడేరు ఐటీడీఏ, ఆలయ కమిటీ విస్తృత ఏర్పాట్లు చేశాయి.



మత్స్యగుండంలో మత్స్యదేవతలు

చేపలే మత్స్యదేవతలు

- మహిమాన్విత పుణ్యక్షేత్రం మత్స్యగుండం
- గుండంలో చేపలే మత్స్యదేవతలు
- నేటి నుంచి మూడు రోజుల పాటు జాతర
- ప్రభుత్వం, ఐటీడీఏ, ఉత్సవ కమిటీల విస్తృత ఏర్పాట్లు
- నాలుగు రాష్ట్రాల నుంచి తరలిరానున్న భక్తులు
- 20 ప్రత్యేక సర్వీసులను ఏర్పాటు చేసిన ఆర్టీసీ



సెలయేరు వద్ద ఏర్పాటుచేసిన బారికేడ్లు

సాక్షి,పాడేరు: ఏజెన్సీలోని ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతంగా ప్రముఖ శైవక్షేత్రమైన మత్స్యగుండంకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఆలయాన్ని ఆనుకుని ప్రవహించే ఉత్తర వాహినిగా పిలువబడే మత్స్యగెడ్డలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరిస్తుంటారు. సెలయేరులోని బండరాళ్ల మధ్య ఉన్న గుండంలోని దర్శనమిచ్చే చేపలను మత్స్యదేవతలుగా భక్తులు పూజిస్తుంటారు. నిత్యం పరవళ్లు తొక్కే మత్స్యగుండంలో మురీలు,అటుకులు, వేపిన శెనగపప్పు, చిన్న సైజు కొబ్బరి ముక్కలను ఆహారంగా వేసి మొక్కులు చెల్లించుకుంటారు. ఆలయ ప్రాంగణంలోని శివలింగం, నాగదేవత పుట్ట నిత్యపూజలు అందుకుంటున్నాయి.

జాతరకు ప్రత్యేక ఏర్పాట్లు

మూడు రోజులపాటు జరిగే జాతరకు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కలెక్టర్ విజయ సునీత, ఎస్పీ తుహిన్‌సిన్హా, జేసీ భావన వశిష్ఠ, ఐటీడీఏ పీవో అభిషేక్, సబ్‌కలెక్టర్ ధాత్రిరెడ్డి ఆధ్వర్యంలో అధికార యంత్రాంగం ఏర్పాట్లలో నిమగ్నమైంది.

సెలయేరులో స్నానాలు నిషేధం

మత్స్యగెడ్డ సెలయేరులో లోతుగా మారడంతో అధికారులు స్నానాలను నిషేధించారు. కుళాయిల ద్వారా స్నానాల ఘాట్‌లను ఏర్పాటుచేశారు. ముందుజాగ్రత్త చర్యగా మరోపక్క గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచుతున్నారు. వైద్య ఆరోగ్యశాఖ మూడు రోజులపాటు ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తుంది. భద్రత చర్యలు దృష్ట్యా పోలీసు అవుట్‌పోస్టు ఏర్పాటుచేస్తున్నారు. పారిశుధ్యం, ఇతర ఏర్పాట్లకు సంబంధించి అన్ని శాఖల అధికారులకు బాధ్యతలు అప్పగించారు.



మత్స్యలింగేశ్వరస్వామి

ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

పాడేరు ఆర్టీసీ డిపో నుంచి పాడేరుతో పాటు అరకులోయ, ముంచంగిపుట్టు, చింతపల్లి, జి.మాడుగుల మండలాల నుంచి మత్స్యగుండం క్షేత్రానికి ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడుపుతోంది. ఈనెల 8,9 తేదీల్లో 20 ప్రత్యేక సర్వీసులు ఏర్పాటుచేసింది.

ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో.. : మత్స్యగుండంలో శివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు స్థానిక గిరిజనులతో ఉత్సవ కమిటీ కూడా ఏర్పాటైంది. మఠం సర్పంచ్ మఠం శాంతకుమారి గౌరవ అధ్యక్షురాలిగా,నూతన ఉత్సవ కమిటీ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు గోపాలపాత్రుడు,మత్స్య కొండబాబు, ఇతర కార్యవర్గ సభ్యులు ఉత్సవ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

- గురువారం ఉదయం నుంచి మత్స్యలింగేశ్వర స్వామి ఆలయంలో పూజలను ప్రారంభిస్తారు. ఆలయంతో పాటు మత్స్యగుండంలోను భారీకేడ్లు ఏర్పాటు చేశారు.ఉత్సవాల మూడు రోజులు సాయంత్రం సమయంలో పలు సాంస్కృతిక కళా ప్రదర్శనలను ఏర్పాటు చేశారు. ఈనెల 8వతేదీ శుక్రవారం మహాశివరాత్రి నాడు మత్స్యలింగేశ్వరస్వామి కల్యాణం నిర్వహించనున్నారు. భక్తుల విరాళాలలో ఆలయం వద్ద పలు సౌకర్యాలు అందుబాటులోకి తెచ్చారు. చలువ పందిళ్లు వేశారు.విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నారు.



విద్యుత్ దీపాలతో అలంకరించిన మత్స్యగుండం ఆలయ ప్రధాన ద్వారం, మార్గం

బండరాయిలో కొలువైన విశ్వనాథుడు

వై.రామవరం: మండలంలోని గురమంద అటవీ ప్రాంతంలో బండరాయి రంధ్రంలో కొలువైన విశ్వనాథుడు భక్తుల నుంచి విశేష పూజలు అందుకుంటున్నాడు. మహాశివరాత్రి నాడు ప్రత్యేక బస్సులు నడుపుతారు. మహాశివరాత్రి నాడు సుమారు 25 వేల మంది భక్తులు దర్శించుకుంటారన్న అంచనాతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేసింది. సీఐ రవికుమార్, ఎస్ఐ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటుచేస్తున్నారు.

ప్రత్యేకతలెన్నో..

- ఇక్కడ ఏడాది పొడవునా జీవనదిలా ప్రవహిస్తున్న సెలయేరు విశ్వనాథుని మహిమల్లో ఒకటిగా భక్తులు చెబుతుంటారు.
- ఆలయ ఎదుట ఏటి ఒడ్డున ఉన్న పూలచెట్టు మహాశివరాత్రి రోజు మాత్రమే తెల్లని, ఎర్రని పూలతో నిండుగా ఉంటుంది. మరుసటి రోజుకు మొత్తం పూలు రాలిపోవడం స్వామివారి మహిమగా భక్తుల విశ్వాసం
- ఆలయ ప్రాంగణంలోని పుట్ట నుంచి మహాశివ రాత్రి నాడు వచ్చిన పాముకు పూజలు చేసే వారని చెబుతుంటారు.

సంతాన నందులు

ఆలయ ప్రాంగణంలోని రెండు నంది విగ్రహాల వద్ద మహాశివరాత్రికి ముందు రాత్రి సంతానంలేని దంపతులు నిష్ఠతో జాగారంచేసి, ఉదయాన్నే స్నానాలు చేసి, విశ్వనాథుని దర్శించుకుంటారు, ఆ నందులను ఎత్తుకుని ఒడిలో పెట్టుకుంటే సంతానం కలుగుతుందని ఆ ప్రాంతవాసుల నమ్మకం .

- పాము పడగ ఆకారంలో ఉన్న కొండ మధ్యలో బండరాయి రంధ్రంలోని శివలింగంపై మండు వేసవిలో సైతం ఏడాది పొడవునా చుక్క చుక్క నీరు పడటం విశ్వనాథుని మహిమల్లో ఒకటిగా చెబుతుంటారు.

గిరిజనుడే పూజారి

ఆలయం వద్ద మహాశివరాత్రి రోజు పూజలు నిర్వహించేందుకు గౌరవడుగా పిలవబడే గిరిజనుడే పూర్వం పూజారిగా వ్యవహరించేవాడు. సుమారు పదేళ్లుగా ఆలయ ప్రాంగణంలో అభిషేకాలు నిర్వహించడానికి గిరిజన పూజారి తోపాటు, బ్రాహ్మణ పూజారిని ఏర్పాటు చేశారు. ఈఆలయ అభివృద్ధికి ఆలయ కమిటీతోపాటు తాడేపల్లిగూడెంకు చెందిన ప్రముఖ పంచాంగకర్త, వేద పండితులు పళ్లావఝుల రామకృష్ణశర్మ సహకారం అందిస్తున్నారు. ఇదే ప్రాంగణంలో ఆయన ఆధ్వర్యంలో కాశీ నుంచి తీసుకువచ్చిన విగ్రహాలతో కాశీ విశా లాక్షి అన్నపూర్ణ సమేత విశ్వనాథుని ఆలయం నిర్మించారు. శివరాత్రి వేడుకలకు ముస్తాబు చేస్తున్నారు.



విశ్వనాథుని ఆలయం ఎదుట సంతాన నందులు

ప్రకృతి అందాల మధ్య..

ఒకపక్క బండరాయి పైనుంచి సెలయేరు పరవళ్లు.. మరోపక్క దట్టమైన అటవీప్రాంతంలోని ప్రకృతి అందాల మధ్య కొలువుదీరిన పూతిగుంట పరమేశ్వరుడు శివరాత్రి పూజలకు సిద్ధమయ్యాడు. మండలంలోని చవిటిదిబ్బలు గ్రామానికి 4 కిలో మీటర్ల దూరంలో ఈ ఆలయం ఉంది. ఈప్రాంతం ఆధ్యాత్మికంగా పర్యాటకంగా గుర్తింపు పొందింది. ఏటా మహాశివరాత్రితోపాటు కార్తీక మాసంలో భక్తులు భారీగా వస్తుంటారు. ఆలయ కమిటీ సభ్యుడు కలిమెల బాబూరావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు.



పూతిగుంట పరమేశ్వరుని ఆలయ ప్రాంగణంలో భక్తులు పుణ్యస్నానాలు చేసే జలపాతం

'చేయూత'నిచ్చే ఆత్మీయ నేస్తం

- నేడు అనకాపల్లికి సీఎం వైఎస్ జగన్
- వైఎస్సార్ చేయూత చివరి విడత నిధుల విడుదల



పిసినికాడలో సిద్ధమవుతున్న సభా వేదిక



సాక్షి, అనకాపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆయన గురువారం అనకాపల్లి మండలం పిసినికాడలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో పాల్గొని వైఎస్సార్ చేయూత చివరి విడత నిధులను విడుదల చేయనున్నారు. సీఎం పర్యటనకు జిల్లా యంత్రాంగం, పోలీసులు పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. ముఖ్యమంత్రి ఉదయం 10.20 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 10.45 గంటలకు కశింకోట ఎంపీడీవో కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద దిగుతారు. రోడ్డు మార్గాన 11.15 గంటలకు పిసినికాడ చేరుకొని బహిరంగ సభలో పాల్గొంటారు. 11.40 గంటల నుంచి సుమారు గంటసేపు ప్రసంగించిన అనంతరం బటన్ నొక్కి వైఎస్సార్ చేయూత చివరి విడత నిధుల పంపిణీని ప్రారంభిస్తారు. మహిళామార్ట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి అవార్డులు ప్రదానం చేస్తారు. 12.55 గంటలకు బయలుదేరి కశింకోటలోని హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. 1.05 నుంచి 2.05 గంటల వరకు ప్రజాప్రతినిధులతో ముచ్చటిస్తారు. అక్కడ 2.10 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడ నుంచి 2.35 గంటలకు విమానంలో గన్నవరం ఎయిర్‌పోర్టుకు తిరుగుపయనమవుతారు.

దళారుల తీరుపై మిర్చి రైతుల ఆగ్రహం



రైతులతో మాట్లాడుతున్న పీవో కావూరి చైతన్య

చింతూరు: స్థానిక సంత మార్కెట్లో దళారులు తమ సరకును సరైన ధరకు అమ్ముకోకుండా ఇబ్బందులు పెడుతున్నారంటూ మిర్చి రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం జరిగిన వారాంతపు సంతకు తాము తీసుకువచ్చిన మిర్చి బస్తాలను మేము చెప్పిన ధరకే, తమకే అమ్మాలంటూ దళారులు బెదిరిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. చింతూరులో ప్రతి బుధవారం జరిగే వారాంతపు సంతకు చింతూరు, కూనవరం, వీఆర్‌పురం, ఎటపాక మండలాలకు చెందిన రైతులు మిర్చి బస్తాలను తీసుకొచ్చి విక్రయిస్తుంటారు. వాటిని ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వ్యాపారులు కొనుగోలు చేస్తుంటారు. కాగా రైతుల వద్ద నుంచి వ్యాపారులు నేరుగా కొనకుండా దళారులు చక్రం తిప్పుతూ తమకు వచ్చే ఆదాయానికి గండి కొడుతున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిరక్షరాస్యత, అమాయకత్వాన్ని అలుసుగా చేసుకుని తమ వద్ద నుంచి తక్కువకు కొనుగోలు చేసి అక్కడికక్కడే ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యాపారులకు అధిక ధరకు విక్రయిస్తున్నారని వారు తెలిపారు. అదేమని ప్రశ్నిస్తే సరకుకొనుగోళ్లు నిలిపివేసి తమపై బెదిరింపులకు పాల్పడుతున్నారని రైతులు వాపోయారు. దీనిపై ఆగ్రహించిన రైతులు దళారుల తీరుపై బుధవారం ఐటీడీఏ పీవో కావూరి చైతన్యకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన సంతమార్కెట్‌కు వెళ్లి మిర్చి కొనుగోళ్లను పరిశీలించి రైతులతో మాట్లాడారు. రైతుల సరకును వ్యాపారులకు అమ్మకుండా దళారులు అడ్డుపడితే వారిపై సెక్షన్–107 ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. తహసీల్దార్ నజీముల్లాషా, వ్యవసాయాధికారి శ్రీనివాసరావు, కార్యదర్శి ప్రసాదరావు పాల్గొన్నారు.

కల్యాణానికి విస్తృత ఏర్పాట్లు

ఎటపాక: మండలంలో చరిత్ర ప్రాధాన్యమున్న గొల్లగూడెం, గన్నవరం శివాలయాల్లో మహాశివరాత్రి సందర్భంగా శివపార్వతుల కల్యాణ వేడుకలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. పవిత్ర గోదావరి నది ఒడ్డున ఉన్న గొల్లగూడెంలోని దత్తాత్రేయుడి ఆలయానికి 150 సంవత్సరాలకు పైగా చరిత్ర ఉంది. ఇక్కడ ప్రతిష్ఠించిన దత్తాత్రేయుడు, శివలింగం పచ్చరంగు రాతితో చెక్కినవి. దక్షిణ భారత దేశంలోనే ఇటువంటి రాతితో చేసిన విగ్రహాలు లేవని.. ఇవి త్రేతాయుగంకు చెందినవని పెద్దలు చెపుతున్నారు. గొల్లగూడెం ప్రాంతంలో త్రేతాయుగంలో నిర్మించిన పలు దేవాలయాలు ఉండేవని అవి కాల గర్భంలో కలిసిపోయాయి. ఈ ప్రాంతంలో లభించిన దత్తాత్రేయుడు, శివలింగం విగ్రహాలను గొల్లగూడెం వాసులు ప్రతిష్ఠించి పూజలు చేసేవారు. గోదావరి వరదలతో కాలక్రమేణా అక్కడి కుటుంబాలు వేరే చోట నివాసాలు ఏర్పాటు చేసుకోవడంతో ఆలయానికి ఆదరణ తగ్గింది. అయినప్పటికీ ఇటీవల కాలంలో ఆలయాన్ని పునరుద్ధరించి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇక్కడ భక్తులకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటి చైర్మన్లు బలుసు సునీల్,కడియాల వెంకట్ తెలిపారు. ఈరెండు శివాలయాలతోపాటు నెల్లిపాక, బుట్టాయిగూడెం, వెంకటరెడ్డిపేటలో ఈనెల 8న శివరాత్రి రోజు స్వామి వారి కల్యాణం జరిపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.



గోదావరి తీరంలో ముస్తాబైన శివాలయం

2,868 మంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ



రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ చెక్కును పంపిణీ చేస్తున్న కలెక్టర్ విజయసునీత

- వారి ఖాతాల్లో రూ.1.53కోట్లు జమ
- కలెక్టర్ విజయ సునీత

సాక్షి,పాడేరు: ఖరీఫ్‌లో వర్షాభావంతో పాటు మిచాంగ్ తుపాను వల్ల నష్టపోయిన జిల్లాలోని రైతులకు ప్రభుత్వం న్యాయం చేసిందని కలెక్టర్ విజయసునీత తెలిపారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయం నుంచి ఇన్‌పుట్ సబ్సిడీని బటన్ నొక్కి రైతుల ఖాతాల్లో జమ చేశారు.ఈ ఈకార్యక్రమం ప్రత్యక్ష ప్రసారాన్ని కలెక్టరేట్ నుంచి అధికారులు, రైతులు వీక్షించారు. జిల్లాలోని 2868 మంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ రూ.కోటి 52లక్షల 73వేల 797ల విలువైన నమూనా చెక్కును కలెక్టర్ పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జిల్లాలో మిచాంగ్ తుపాన్‌తో సుమారు 1093 హెక్టార్లలో వివిధ పంటలు నష్టపోయిన 2868 రైతులను గుర్తించామన్నారు.ఏ సీజన్‌లో జరిగిన పంట నష్టాలకు అదే సీజన్‌లో ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవడం గొప్ప విషయమన్నారు. జిల్లా వ్యవసాయ మండలి అధ్యక్షురాలు సరస్వతి, వ్యవసాయ, ఉద్యానవనశాఖ జిల్లా అధికారులు ఎస్‌బీఎస్ నందు, రమేష్‌కుమార్‌రావు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతే లక్ష్యంగా పాలన

- అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ
- వైఎస్సార్ ఆసరా పంపిణీ



వైఎస్సార్ ఆసరా నమూనా చెక్కును పంపిణీ చేస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

పెదబయలు: మహిళల సంక్షేమం, వారి ఆర్థికబలోపేతమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. స్థానిక మార్కెట్‌యార్డు షెడ్డులో నాలుగో విడత ఆసరా పంపిణీ కార్యక్రమాన్ని ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ తన పాలనలో మహిళలను మహారాణులుగా చేశారన్నారు. మండలంలో నాలుగో విడత వైఎస్సార్ ఆసరా పథకంలో పథకంలో 326 స్వయం సహాయక సంఘాలకు చెందిన 3496 మంది సభ్యులకు రూ.1,20,82,741ల మేర ఖాతాల్లో జమ అయిందన్నారు. స్త్రీ నిధి పథకం నాలుగో విడతలో107 స్వయం సహాయక సంఘాల్లో 426 మంది సభ్యులకు రూ.2.90 కోట్లు ప్రభుత్వం జమ చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆగ్రో డైరెక్టర్ వనల్బ సన్యాసి, ఎంపీపీ బొండా వరహాలమ్మ, జెడ్పీటీసీ కూడ బొంజుబాబు, వైస్ ఎంపీపీ రాజుబాబు, అరకు ఏరియా కోఆర్డినేటర్ కృష్ణారావు, ఏపీఎం కళావతి, మండల పార్టీ అధ్యక్షులు వంతాల ఆనందరావు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.



హాజరైన మహిళలు

కలెక్టర్ విజయ సునీతకు సత్కారం



కలెక్టర్ విజయ సునీతను సత్కరిస్తున్న మహిళా ఉద్యోగులు

సాక్షి,పాడేరు: కలెక్టరేట్‌లో ఏపీ మహిళా జేఏసీ ఉద్యోగులంతా ముందస్తుగానే అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ విజయ సునీత కేక్‌ను కట్ చేసి మహిళలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. మహిళా ఉద్యోగులంతా ఆమెను ఘనంగా సత్కరించారు.

ఎన్నికల్లో నోడల్ అధికారులదే కీలకపాత్ర

- కలెక్టర్ విజయ సునీత

సాక్షి,పాడేరు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో నోడల్ అధికారులదే కీలకపాత్ర అని కలెక్టర్ విజయ సునీత అన్నారు. బుధవారం రాత్రి కలెక్టరేట్‌లో నోడల్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయిన క్షణం నుంచే ప్రవర్తనా నియమావళి అమల్లోకి వస్తుందన్నారు. నోడల్ అధికారులంతా ముందుగానే సంబంధిత ఎన్నికల విధుల్లో నిమగ్నమవ్వాలని సూచించారు. జిల్లాలో భౌగోళికంగా, రవాణా పరంగా ఎన్నో సవాళ్లు ఉన్నాయని.. వాటిని అధిగమిస్తూ ఎన్నికల విధుల్లో సమర్థవంతంగా పనిచేయాలన్నారు.ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను పాటించడంతో పాటు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మేన్ పవర్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించి జిల్లాలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని గుర్తించి సమగ్ర డేటాను సేకరించాలన్నారు. వివిధ స్థాయిల్లో ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని సూచించారు.శాంతి భద్రతల సమస్యలు లేకుండా చూడాలని, ఎన్నికల సిబ్బందికి కండీషన్‌లో ఉన్న రవాణా వాహనాలను అందుబాటులో ఉంచాలన్నారు. డ్రైవర్లంతా డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి నేరుగా పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని, మధ్యలో వాహనాలు ఎక్కడ ఆపకుండా నోడల్ అధికారులు పర్యవేక్షించాలన్నారు. ఈవీఎంల వినియోగంపై ప్రజల్లో చైతన్యం తేవాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఎస్‌డీసీ అంబేద్కర్, నోడల్ అధికారులు అప్పారావు, లీలాప్రసాద్, సునీల్‌కుమార్, మురళీ, సువర్ణఫణి, గోవిందరాజులు,ఎస్‌బీఎస్ నందు, రమేష్‌కుమార్‌రావు పాల్గొన్నారు.



నోడల్ అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ విజయ సునీత

విశాఖ విజనరీ



@ 5 ఇయర్స్.. రూ.1.05 లక్షల కోట్లు

- సీఎం జగన్ నాయకత్వంపై ప్రజల్లో విశ్వసనీయత
- అందుకే తప్పక కార్యరూపం దాలుస్తుందన్న నమ్మకం
- ఐదేళ్లలో రూ.లక్ష కోట్లకు పైగా బడ్జెట్ ప్లాన్
- విశాఖ ఆర్థికంగా మరింత బలోపేతానికి దోహదం
- 'విజన్ విశాఖ' భేష్ అంటున్న మేధావులు, విద్యా, పారిశ్రామికవేత్తలు

సాక్షి, విశాఖపట్నం: హామీలివ్వడం, వాగ్దానాలు చేయడం రాజకీయ నాయకులకు, ప్రజా ప్రతినిధులకు పరిపాటి. వాటిని అమలు చేసే వారు అత్యంత అరుదుగా ఉంటారు. అలాంటి వారిపై ప్రజలు విశ్వాసాన్ని పెంచుకుంటారు. అంతటి విశ్వాసాన్ని సొంతం చేసుకున్న నేతగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గుర్తింపు పొందారు. విశ్వసనీయతకు మారు పేరుగా నిలిచారు. అందుకే ఆయన ఏ హామీ ఇచ్చినా అమలు చేసి తీరుతారన్న గట్టి నమ్మకాన్ని జనంలో ప్రోది చేసుకున్నారు. ఇప్పటికే ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్నవే కాదు.. కాలానుగుణంగా ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక అనతికాలంలోనే ఆచరణలో చూపారు. మునుపు అధికారంలో ఉన్న చంద్రబాబువి నోటి మాటలు, ఓటి మాటలే తప్ప అమలు చేయరన్న పేరు గడించారు. **అందుకు భిన్నంగా జగన్ తీరు** ఉండడంతో ఆయన **ఇచ్చే వాగ్దానాలపై సామాన్యు**లకు గాని, సంపన్నులకు గాని, వ్యాపారవేత్తలకు గాని, పారిశ్రామికవేత్తలకు గాని, వివిధ రంగాల నిపుణులకు గాని ఎలాంటి సంశయమూ కలగడం లేదు. తాజాగా 'విజన్ విశాఖ' పేరిట విశాఖ అభివృద్ధికి లక్ష్యాన్ని నిర్దేశించుకోవడం, అందుకు రూ.1.05 లక్షల కోట్లు వెచ్చించేందుకు ప్రణాళికలు రూపొందించడం అభినందనీయం అంటూ వారంతా హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. లక్ష్య సాధనకు ఐదేళ్ల సమయం నిర్దేశించుకోవడం, పదేళ్లలో హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నగరాలకు దీటుగా విశాఖను తీర్చిదిద్దేలా నిర్ణయించడం ఆహ్వానించదగ్గ పరిణామం.. ఆచరణ సాధ్యం అంటూ విజన్ విశాఖ డాక్యుమెంటును స్వాగతిస్తున్నారు. అవి వారి మాటల్లోనే..

ముంబైకి దీటుగా విశాఖ



పశ్చిమ తీరంలో ముంబై ఎంతలా అభివృద్ధి చెందిందో.. తూర్పు తీరంలోని విశాఖ కూడా అదే రీతిలో వృద్ధికి అవకాశం ఉంది. ఆర్థిక రాజధానిగా, విద్య, వైద్య రంగాల్లో మహా నగరాలకు దీటుగా ఉంది. ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్, బీహార్ తదితర రాష్ట్రాల నుంచి వైద్యం కోసం ఇక్కడకే వస్తుంటారు. విదేశాల్లో అందే వైద్యం ఇక్కడ అందుతోంది. ఇప్పటికే ఆసియాలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందే నగరాల్లో విశాఖ ముందుంది. విజన్ విశాఖతో వైజాగ్ మరింతగా అభివృద్ధి చెందుతుందనడంలో సందేహం లేదు. అభివృద్ధిలో విశాఖకు ఉన్నంత సానుకూలతలు రాష్ట్రంలో మరే నగరానికి లేవు. విజన్ వైజాగ్ కల పదేళ్లలో సాకారం అవుతుంది.

– కె.శ్రీరామ్మూర్తి, రిటైర్డ్ ఎకనామిక్స్ ప్రొఫెసర్, ఏయూ

సీఎంకు విశాఖపై స్పష్టమైన విజన్



విశాఖను అభివృద్ధి పథంలో ఎలా ముందుకు తీసుకెళ్లాలన్న దానిపై సీఎం వైఎస్ జగన్‌కు స్పష్టమైన విజన్ ఉంది. 'విజన్ విశాఖ' ఆలోచన చాలా మంచి నిర్ణయం. విశాఖ అభివృద్ధికి నిర్ణీత ఐదేళ్లలో రూ.లక్ష కోట్లకు పైగా వెచ్చించేందుకు ప్రణాళికలు రూపొందించడం హర్షించదగ్గ పరిణామం. దీంతో పెట్టుబడులకు రాచబాట ఏర్పడుతుంది. పారిశ్రామికంగా విశాఖ మరింత వృద్ధి చెందుతుంది. అన్నింటా కనెక్టివిటీ విస్తృతమవుతుంది. ఫలితంగా విశాఖతో పాటు ఈ ప్రాంతంలో ఉపాధి, ఉద్యోగావకాశాలు గణనీయంగా పెరుగుతాయి.

– జి.సాంబశివరావు, ఎండీ, శ్రావణ్ షిప్పింగ్స్, విశాఖపట్నం

సీఎం విజన్ క్రిస్టల్ క్లియర్



విశాఖ అభివృద్ధిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి విజన్ క్రిస్టల్ క్లియర్‌గా ఉంది. ఆయన ఏదైనా హామీ ఇచ్చినా, నిర్ణయాన్ని ప్రకటించినా కచ్చితంగా అమలు చేసి తీరుతారన్న నమ్మకం అన్ని వర్గాల్లోనూ ఉంది. సీఎం ప్రకటించిన విజన్ విశాఖ డాక్యుమెంట్ చాలా మంచి నిర్ణయం. దీనిని మా సీఐఐ స్వాగతిస్తోంది. విజన్ విశాఖ డాక్యుమెంట్ కూడా తప్పకుండా కార్యరూపం దాలుస్తుంది. అందులో ఎవరికీ ఎలాంటి సందేహం లేదు. 'విజన్ విశాఖ'తో నగరానికి అన్ని విధాలా కనెక్టివిటీ పెరుగుతుంది. విశాఖ మరింత శరవేగంగా అభివృద్ధి చెందుతుంది.

– గ్రంధి రాజేష్, సీఐఐ విశాఖ జోన్ చైర్మన్

పొరుగు ప్రాంతాలూ అభివృద్ధి



విజన్ విశాఖ డాక్యుమెంట్ కార్యరూపం దాలుస్తుందనడంలో సందేహం లేదు. ఎందుకంటే ఆచరణ సాధ్యం చేసే ముఖ్యమంత్రి ఉండడం, అభివృద్ధికి దోహదపడే ప్రకృతి, సహజ సిద్ధ వనరులు విశాఖ సొంతం కావడం ఇందుకు దోహదం చేస్తుంది. ఇలాంటి అనుకూలతలు రాష్ట్రంలో మరే నగరానికి, ప్రాంతానికి లేవు. విజన్ విశాఖ డాక్యుమెంట్ ద్వారా విశాఖతో పాటు పొరుగున ఉన్న ప్రాంతాలూ అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందుతాయి. లాజిస్టిక్స్, ఎగుమతులు పెరుగుతాయి. రాష్ట్రంలో అతిపెద్ద నగరం కావడం వల్ల వివిధ సంస్థల ప్రధాన కార్యాలయాలు ఇక్కడ ఏర్పాటవుతాయి. వైజాగ్ ప్రాంతానికి ఎంతో ప్రయోజనం చేకూర్చే 'విజన్ విశాఖ'ను స్వాగతిస్తున్నాం.

– పైడా కృష్ణప్రసాద్, ప్రెసిడెంట్, ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ ఫెడరేషన్

సీఎం అంకితభావాన్ని ఊహించలేదు



వచ్చే ఎన్నికల్లో గెలిచాక విశాఖలోనే ప్రమాణ స్వీకారం చేస్తామని ప్రకటించిన సీఎం వైఎస్ జగన్‌కున్న అంకితభావాన్ని మేం ఊహించలేదు. మమ్మల్ని ఆశ్చర్యానికి గురి చేసింది. విశాఖపై మా అంచనాలకు మించి ఆయన విజన్ ఉంది. విజన్ విశాఖ డాక్యుమెంట్‌తో ఈ విషయం స్పష్టమైంది. విజన్ విశాఖ ద్వారా రోడ్డు, వాయు కనెక్టివిటీ మరింతగా పెరుగుతుంది. విజన్ డాక్యుమెంట్ అమలైతే వైజాగ్ ముంబైతో కచ్చితంగా పోటీ పడుతుందన్న నమ్మకం మాకుంది. విశాఖ ఐకానిక్ బిల్డింగ్ నిజంగానే ఐకానిక్‌గా మిగిలిపోతుంది.

– కంకటాల మల్లిక్, ఫ్యాప్సీ ఉపాధ్యక్షుడు, అధ్యక్షుడు, క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్

రాష్ట్రానికి విశాఖ గ్రోత్ ఇంజిన్



వెనుకబడిన ఉత్తరాంధ్ర ప్రాంత అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్ ధృడ చిత్తంతో ఉన్నారని విజన్ విశాఖ డాక్యుమెంట్ ప్రకటన ద్వారా మరోసారి రుజువైంది. విశాఖ నగరం రాష్ట్రానికి ఒక గ్రోత్ ఇంజిన్‌గా నిలుస్తోంది. ఐదేళ్లలో రూ.లక్ష కోట్ల బడ్జెట్ ప్లాన్ రూపొందించడం ఆహ్వానించదగ్గ పరిణామం. విజన్ విశాఖ డాక్యుమెంట్‌పై వికేంద్రీకరణ జేఏసీ హర్షం వ్యక్తం చేస్తోంది.

– లజపతిరాయ్, వికేంద్రీకరణ నాన్ పొలిటికల్ జేఏసీ చైర్మన్

ఏపీ భవిష్యత్తు విశాఖపైనే ఉంది..



రాష్ట్రంలో శరవేగంగా అభివృద్ధి చెందగలిగే ఏకైక నగరం విశాఖే. విశాఖ అభివృద్ధి చెందితేనే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందుతుంది. హైదరాబాద్‌కు వచ్చే ఆదాయంతో తెలంగాణ ఎలా అభివృద్ధి చెందిందో వైజాగ్ కూడా అంతే. భవిష్యత్తులోనూ సంపద సృష్టించే నగరం విశాఖే. ఏపీ భవిష్యత్తు విశాఖపైనే ఉంది. ఇక్కడ ఉన్నన్ని వనరులు రాష్ట్రంలో మరెక్కడా లేవు. వైజాగ్‌ను చూపించే రాష్ట్రంలో పెట్టుబడులు తెచ్చుకునే వీలుంది. వీటన్నిటినీ దృష్టిలో ఉంచుకునే సీఎం వైఎస్ జగన్ 'విజన్ విశాఖ' డాక్యుమెంట్ ప్రకటన చేశారు. ఆయన ప్రకటనను విశాఖ వాసులుగా మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నాం. ఆయన విజన్ కల సాకారం కావాలని ఆకాంక్షిస్తున్నాం.

– ఎస్ఎస్ శివశంకర్, అధ్యక్షుడు, ఉత్తరాంధ్ర చైతన్య వేదిక

ప్రజా సంక్షేమమే జగనన్న ఆకాంక్ష



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు

వీఆర్ పురం: ప్రజలందరూ సుఖసంతోషాలతో నిశ్చింతగా బతకాలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్ష అని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతఉదయభాస్కర్ అన్నారు. మండలంలో బుధవారం వీఆర్ పురం నుంచి చింతరేగుపల్లి వరకు నిర్వహించిన వాహన యాత్ర(రోడ్ షో)కు విశేష స్పందన లభించింది. కార్యక్రమంలో పాల్గొన్న వారు మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పింఛన్ పొందాలంటే కార్యాలయాల చుట్టూ, జన్మభూమి కమిటీల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేదని, కానీ నేడు వైఎస్సార్‌సీపీ పాలనలో వలంటీరే పింఛన్ ధదరఖాస్తు స్వీకరించి పింఛన్ అందిస్తున్నారని చెప్పారు. వీఆర్ పురం మండలంలో ఐదేళ్లలో ప్రభుత్వం సంక్షేమ పథకాల ద్వారా నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు రూ.130 కోట్ల మేరకు పైగా నగదు జమ చేసిందన్నారు. మండల వ్యాప్తంగా 3695 మందికి పింఛన్‌లు, 504 మంది గిరిజన రైతులకు 1350 ఎకరాల కొండపోడు భూములకు పట్టాలు అందించినట్టు చెప్పారు. జగనన్న అధికారంలో వచ్చాక ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేసి, డ్వాక్రా మహిళల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. వీఆర్ పురం మండలంలోని 2069 మంది డ్వాక్రా మహిళలకు నాలుగు విడతల్లో రూ.2.60 కోట్లు ప్రభుత్వం అందజేసిందన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మాదిరెడ్డి సత్తిబాబు, జేసీఎస్ మండల ఇన్‌చార్జి బొడ్డు సత్యనారాయణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాచర్ల గంగులు, వ్యవసాయ శాఖ సలహా మండలి సభ్యుడు ముత్యాల శ్రీనివాస్, ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చిక్కాల బాలు, వైస్ ఎంపీపీ ముత్యాల గంగాభవాని పాల్గొన్నారు.

సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధిని నివారిద్దాం

- చింతూరు ఐటీడీఏ పీవో చైతన్య

చింతూరు: సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య అన్నారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో వైద్యశాఖ అధికారులతో కలిసి ఆయన సికిల్‌సెల్ ఎనీమియా నిర్మూలనకు సంబంధించిన పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం పీవో మాట్లాడుతూ జన్యుపరంగా సంక్రమించే ఈ వ్యాధిపై అవగాహనతోనే నిర్మూలించవచ్చన్నారు. చింతూరు ఐటీడీఏ పరిధిలో 46,150 మందికి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించినట్టు పీవో తెలిపారు. ఫ్యామిలీ వెల్ఫేర్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రమేష్‌బాబు, డీసీహెచ్ఎస్ డాక్టర్ కృష్ణారావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పుల్లయ్య, సూపరింటెండెంట్ డాక్టర్ కోటిరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై అశ్రద్ధ వహిస్తే చర్యలు

- పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్

జి.మాడుగుల: ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల ఆరోగ్యం పట్ల అశ్రద్ధ వహిస్తే చర్యలు తప్పవని పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ హెచ్చరించారు. మండలంలో కె.కోడాపల్లి పంచాయతీ బందవీధి ప్రభుత్వం గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. ఆశ్రమ పాఠశాలలో వంటగదిని తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన మెనూ విద్యార్థులకు అందించాలని ఆయన ఆదేశించారు. ప్రతి రోజూ బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థులు అనారోగ్యానికి గురైతే వెంటనే ఆస్పత్రికి తరలించి వైద్యం అందించాలని ఆయన అన్నారు. ఆశ్రమ పాఠశాలలో సిక్ రూమ్‌లో ఉన్న 8వ తరగతి విద్యార్థిని వెంకటలక్ష్మితో మాట్లాడారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఆమెకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించాలని హెచ్ఎంకు సూచించారు. పాఠశాలలో నీరసంగా ఉన్న ఐదుగురు విద్యార్థులను ఆటోలో ఆస్పత్రికి తరలించారు. ఈ ఏటీడబ్ల్యూవో తిరుపాల్ పాల్గొన్నారు.

కనులపండువగా కల్యాణం



కల్యాణానికి పట్టువస్త్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి

సాక్షి, పాడేరు: మహాశివరాత్రి మహోత్సవాలు పురస్కరించుకుని పట్టణంలోని ఉమానీలకంఠేశ్వర స్వామి వారి కల్యాణం బుధవారం రాత్రి కన్నుల పండువగా నిర్వహించారు. మోదకొండమ్మతల్లి ఆలయం నుంచి పట్టువస్త్రాలు, పూజా సామగ్రిని ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలంనాయుడు, రమాదేవి దంపతులు, భక్తులు తీసుకువచ్చారు. పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ఉమానీలకంఠేశ్వరస్వామి మూలవిరాట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారి కల్యాణానికి పట్టు వస్త్రాలు అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు రామం ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆధ్యాత్మిక కమిటీ ప్రతినిధులు, భక్తులు కల్యాణోత్సవాన్ని వీక్షించారు. లోక కల్యాణార్థం ప్రత్యేక హోమం నిర్వహించారు.

కీలకమైన ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యం



శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎంపీ మాధవి, పక్కన జీసీసీ, జడ్పీ చైర్‌పర్సన్లు స్వాతిరాణి, సుభద్ర

కొయ్యూరు: కీలకమైన ప్రాంతాల అభివృద్ధికి ఎంతో ప్రాధాన్యమిచ్చామని అరకు ఎంపీ మాధవి అన్నారు. రాజేంద్రపాలెంలో రూ.25 లక్షలతో నిర్మించిన గిరిజన భవన్‌ను జీసీసీ చైర్మన్ స్వాతిరాణి, జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్రతో కలిసి బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇక్కడ గిరిజన భవన్‌కు తన తండ్రి దివంగత ఎమ్మెల్యే గొడ్డేటి దేముడు పేరు పెట్టడం ఆనందంగా ఉందన్నారు. కోవిడ్ కారణంగా మూడేళ్లపాటు ఎంపీ నిధులు రాలేదన్నారు. చివరి రెండేళ్లలో వచ్చిన నిధులనుఅభివృద్ధికి కేటాయించామని చెప్పారు. త్వరితగతిన భవన నిర్మాణం పూర్తి చేసిన నర్సి కృష్ణ, సురబోయిన సత్యారావులను అభినందించారు. జీసీసీ చైర్మన్ స్వాతిరాణి మాట్లాడుతూ గిరిజన సంక్షమానికి నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర మాట్లాడుతూ కేంద్రం నిబంధనల కారణంగా గిరిజన ప్రాంతంలో ఆరు శాతం రిజర్వేషన్ అమలు చేయాల్సి వస్తుందన్నారు. జీవో నంబర్–3పై అన్ని రాష్ట్రాలు కలిసి పోరాడితే కేంద్రం దిగి వస్తుందన్నారు. నేనుసైతం చారిటబుల్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కె.శివప్రసాద్, పాడేరు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త విశ్వేశ్వరరాజు, జెడ్పీటీసీ వారా నూకరాజు, ఎంపీపీ బడుగు రమేష్, ఏఎంసీ చైర్మన్ రాజులమ్మ, గిరిజన ఉద్యోగ సంఘ నేతలు నర్సిపాపారావు, కృష్ణ దేముడు, బీఎస్ఎన్ఎల్ కేంద్ర సలహా కమిటీ డైరెక్టర్ కిరణ్ పాల్గొన్నారు.

సైన్స్ పరికరాల పంపిణీ

సైన్స్‌పై విద్యార్థులు ఆసక్తి కనబరచాలని ఎంపీ మాధవి అన్నారు. ఆమె స్థానిక బాలుర ఆశ్రమ పాఠశాలలో సైన్స్ పరికరాలను జీసీసీ చైర్మన్ స్వాతిరాణి, జడ్పీ చైర్మన్ సుభద్రతో కలిసి పంపిణీ చేశారు. ఇందుకు గాను ఆమె నిధుల నుంచి 17 ఆశ్రమ పాఠశాలలకు రూ.33 లక్షలు వెచ్చించారు.

కుస్తీ క్రీడాకారులకు పరికరాలు

కుస్తీ పోటీలకు రూ.పది లక్షలతో కొనుగోలు చేసిన పరికరాలను ఎంపీ మాధవి పంపిణీ చేశారు. క్రీడల్లో విద్యార్థులు రాణించాలని ఆమె కోరారు.

వ్యాన్ బోల్తాపడి బాలుడి మృతి



మృతిచెందిన బాలుడు పవన్‌కల్యాణ్

అనంతగిరి: మండలంలోని లంగుపర్తి గిరిజన సంక్షేమ బాలురు పాఠశాల సమీపంలోని బుధవారం బొలేరో వాహనం అదుపుతప్పి బోల్తాపడిన ఘటనలో ఎస్.కోట ప్రాంతానికి చెందిన బాలుడు మృతి చెందాడు. లంగుపర్తిలో మహాశివరాత్రి జాతర సందర్భంగా ఎస్.కోట ప్రాంతానికి చెందిన సౌండ్ సిస్టం, స్టేజ్‌ను బొలేరో వాహనంలో తీసుకువచ్చారు. పాఠశాల సమీపంలోని వాహనం అదుపుతప్పి వెనుకకు జారడంతో బోల్తాపడింది. ఈ ప్రమాదంలోని వాహనంలో ఉన్న ఎస్.కోట ప్రాంతానికి చెందిన పవన్‌కల్యాణ్(15) అనే బాలుడు మృతిచెందాడు. కుటుంబ అవసరనిమిత్తం పనికి వచ్చి, మృత్యువాతపడడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. అనంతగిరి పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలికా విద్యకు అధిక ప్రాధాన్యం

చింతపల్లి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం బాలికా విద్యకు అధిక ప్రాధాన్యమిస్తూ అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని శిశు సంక్షేమశాఖ పీడీ సూర్యలక్ష్మి కోరారు. బుధవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బాల్యవివాహాల నిరోధంపై మహిళా శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో డివిజన్‌స్థాయి సదస్సులో ఆమె మాట్లాడారు. చదువుతోనే గిరిజన బాలికల ప్రగతి ముడిపడి ఉందన్నారు. ఇందుకోసం అంగన్‌వాడీ కేంద్రాల నుంచి ఉన్నత చదువుల వరకూ ప్రభుత్వం బాలికా విద్యను అన్నివిధాలుగా ప్రోత్సహిస్తోందన్నారు. ప్రధానంగా గ్రామాల్లో బాల్యవివాహాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. బాల్యవివాహాలకు సంబంధించిన సమాచారం ఉంటే తక్షణమే అంగన్‌వాడీ సిబ్బంది, మహిళా పోలీసులకు చేరవేయాలన్నారు. జెడ్పీటీసీ బాలయ్య మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పోత్సాహకాలను బాలికలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు రాజ్‌కుమార్, ఎంపీడీవో వీరసాయిబాబు, ఎంఈవో ప్రసాద్, ఏటీడబ్ల్యూవో జయలక్ష్మి, ఐసీడీఎస్ పీవో రమణి, సూపర్‌వైజర్ విజయ, చింతపల్లి, గూడెంకొత్తవీధి, కొయ్యూరు మండలాలకు చెందిన ఐసీడీఎస్ అధికారులు, సచివాలయ పోలీసులు పాల్గొన్నారు.

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి



చింతూరులో క్రికెట్ ప్రాక్టీస్‌ను ప్రారంభిస్తున్న పీవో చైతన్య, ఓఎస్డీ మహేశ్వరరెడ్డి



గోమంగిలో మాట్లాడుతున్న పాడేరు ఏఎస్పీ ధీరజ్

పెదబయలు: గిరి యువత మారుతున్న కాలాన్ని, అవకాశాలను అందిపుచ్చుకోవాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని పాడేరు ఏఎస్పీ ధీరజ్ అన్నారు. బుధవారం పెదబయలు మండలం మారుమూల గోమంగి పంచాయతీ కేంద్రంలో విశాఖ జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో యువహో కార్యక్రమంలో భాగంగా మెగా వాలీబాల్ పోటీలను నిర్వహించారు. అనంతరం గోమంగిలో ఏర్పాటు చేసిన సభలో ఏఎస్పీ ధీరజ్ మాట్లాడుతూ యువతీ యువకులు ప్రభుత్వం అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వాలీబాల్ పోటీలో 60 జట్లు పాల్గొన్నాయి. అందరికీ భోజన సదుపాయాన్ని పోలీసు శాఖ సమకూర్చింది. పోటీల్లో విజేతగా నిలిచిన కిముడుపల్లి పంచాయతీ పులిగొంది జట్టుకు రూ.20 వేల నగదు, ట్రోఫీ, ద్వితీయ స్థానంలో నిలిచిన సీకరి పంచాయతీ అలమగుండం జట్టు రూ.15 వేల నగదు.ట్రోఫీ, తృతీయ స్థానంలో నిలిచిన అడుగులపుట్టు పంచాయతీ జంగంపుట్టు జట్టుకు రూ.10 వేల నగదు ట్రోఫీని ఏఎస్పీ ధీరజ్ అందజేశారు. అ పోటీల్లో పాల్గొన్న అన్ని జట్లకు టీ షర్టులు, వాలీబాల్ కిట్లు అందజేశారు. జి. మాడుగుల సీఐ రమేష్, పెదబయలు ఎస్ఐ మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు

చింతూరు: అందివచ్చిన అవకాశాలను వినియోగించుకుంటూ క్రీడల్లో రాణించడం ద్వారా ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య, రంపచోడవరం ఓఎస్డీ కె.వి.మహేశ్వరరెడ్డి అన్నారు. జమాల్‌ఖాన్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన క్రికెట్ ప్రాక్టీసు నెట్, లాంగ్ జంప్ కోర్టును వారు బుధవారం ప్రారంభించారు. ట్రస్ట్ వ్యవస్థాపకులు జమాల్‌ఖాన్ మాట్లాడుతూ క్రికెట్ శిక్షణ కోసం రూ 3.50 లక్షలతో నెట్ సమకూర్చినట్టు చెప్పారు. యువతకు సరైన శిక్షణ దొరికితే క్రీడల్లో రాణించే అవకాశముంటుందన్నారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వంట సామగ్రిని వితరణగా అందించిన ఆయన పాఠశాలలో లైబ్రరీ నిర్మాణానికి హామీ ఇచ్చారు. ఎంపీపీ సవలం అమల, వైస్ ఎంపీపీ మేడేపల్లి సుధాకర్, ఎంపీడీవో రవిబాబు, నాయకులు చిన్నారెడ్డి, సురేష్, ట్రస్ట్ సభ్యులు సుభానీ, ఇమ్రాన్‌ఖాన్, క్రీడాకారులు గణేష్, రియాజ్, హసన్‌అలీ, ఆరీఫ్, శంకర్, నాగు, ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యంతో చదివితే ఉన్నత విజయాలు

చింతూరు: విద్యార్థులు లక్ష్యం నిర్దేశించుకుని కష్టపడి విద్యను అభ్యసించడం ద్వారా ఉన్నత విజయాలు సాధించవచ్చని చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన బుధవారం సందర్శించి పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ కష్టపడి చదివి త్వరలో జరిగే పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. పై తరగతుల్లో మరింత మంచి మార్కులు సాధించే దిశగా ప్రయత్నించాలని, తమ తోటి వారికి కూడా మంచి విద్య అందించేందుకు తోడ్పాటు అందించాలన్నారు. త్వరలో జరగనున్న పరీక్షల్లో వందశాతం ఫలితాలు వచ్చేలా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రీ ఫైనల్ పరీక్షల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టిసారించి ప్రత్యేక తరగతులు నిర్వహించి వారు మెరుగుపడేలా చూడాలని పీవో కావూరి చైతన్య ఆదేశించారు. ఎంఈవో లక్ష్మీనారాయణ, పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు జిక్రియా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.